


# సర్పశిల

## – భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

ఇప్పటి వరకూ జరిగిన కథ

*ఓ అడవిలోనున్న ఆలయం దగ్గర మొదలైన కథ, 'రాబీ వెబ్‌స్టర్ ' అనే అమెరికన్ ఇండియాలో దిగడంతో ఓ మలుపు తిరుగుతుంది. 'తక్షపురం 'లోని సర్పశిల ఒక మలుపుకి సంకేతమైతే 'నల్లమల 'లో జరిగిన విశ్వశాంతి యజ్ఞం మరో మలుపు. ఒక వైపున కొన్ని శక్తులు ప్రకృతి విధ్వంసానికి రచన చేస్తూంటే మరోవైపు ప్రకృతి రక్షకులు ప్రకృతిని కాపాడే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటారు. అనేకానేక పాత్రలు తమ విధిని నిర్వర్తిస్తూవుంటాయి. అందరి లక్ష్యమూ ఒకటే - విశ్వశాంతి.*

**"జియాముస్త ఫిజర్"** కాలం చేశారు" విచారంగా అన్నాడు అచ్యుత్. "అయ్యో" అప్రయత్నంగా అన్నాడు పుండరీకాక్షుడు. సౌభాగ్యలక్ష్మి భర్తవైపు పరిగెత్తింది.

"అచ్యుతా.. చావు కబురు చల్లగా చెప్పమన్నారు అనాసిన్ టేబ్లెట్ అనౌన్స్‌మెంట్‌లా కాదు" కొంచెం కోపంతో అని తండ్రి దగ్గరికి పరిగెత్తాడు. పుండరీకాక్షుడి ముఖం కళతప్పి వుంది.

"నాన్నా" అన్నాడు వాసుదేవ్.

ఫరవాలేదురా.. మంచి మిత్రుడు కాలంలో కలిసిపోయాడంటే కలిగిన బాధ. అంతే. ఈ లోకంలో ఎవరు శాశ్వతం! వాసూ, నా దగ్గర జియా 'గాయత్రీ' మంత్రాన్ని ఉపదేశంగా పొందాడు. అందర్నీ ప్రేమించే తత్వం అతనిది. అతనికి గాయత్రి నేర్పినందుకు మా నాన్న మొదట్లో నన్ను చాలా తిట్టేవాడు. కానీ అతను సంధ్యావందనం భక్తి శ్రద్ధలతో చేయడం సంగతి విని మానాన్న సంతోష పడ్డాడు. ఇలా సంధ్య వార్చుకుంటున్నప్పుడే అతని మరణం గురించి వినడం.. సైలెంటైపోయాడు పుండరీకాక్షుడు.

"పదండి నాన్నా.. వెళ్ళి చూద్దాం. మీరు మీ కార్యక్రమం ముగించుకుని సిద్ధంగా ఉండండి. నేను అక్కడికి వెళ్ళి వారి కార్యక్రమాలు ఎప్పుడో ఎలానో తెలుసుకుని వస్తాను" డ్రెస్ చేసుకుంటూ అన్నాడు వాసుదేవ్.

కొన్ని వందలమంది జియా ముస్తు ఫిజుర్ ఇంటి దగ్గర మౌనంగా నిలబడి ఉన్నారు. ఆయనంటే అందరికీ చాలా ఇష్టం. ఎవరికీ అపకారం చేసిన వాడు కాదు. ఎవరినీ బాధపెట్టినవాడు కాదు. మత ప్రకారం జరగవలసిన కార్యక్రమం జరుగుతోంది.

పుండరీకాక్షుడి కళ్ళు ధారాపాతంగా వర్షిస్తున్నాయి. స్నేహాన్ని మించిన బంధం సృష్టిలో ఏముందీ!

పుట్టినప్పుడు రోజుల తరబడి వేడుకలు జరుగుతాయి. బంధువులు స్నేహితులు పుట్టిన బిడ్డకి రకరకాల కానుకలిస్తారు. ఇల్లంతా సంతోషంతో ఉప్పొంగుతుంది. అదే మనిషి పోతే? దైన్యం, నైరాశ్యం, వైరాగ్యం మిగులుతాయి. పుట్టుక ఓ రంగుల కల అయితే మృత్యువు ఓ పీడకల.

"జీవితంలో అమూల్యమైన ఓ బంధం అకస్మాత్తుగా తెగిపోయింది" చిన్నగా అన్నాడు పుండరీకాక్షుడు వాసుదేవ్‌తో. ఆ స్వరం చాలా బలహీనంగా ఉంది.

"వాసూ. పోయే ప్రతి జీవీ ఓ హెచ్చరికలాంటిది. మనం యీ లోకానికి అతిధులుగా వచ్చామనీ, ఏదో ఓ నాటికి పోక తప్పదనీ, ప్రతి మృతదేహం మనని హెచ్చరిస్తుంది. అన్నీ ఇక్కడే వదిలి వెళ్ళేప్పుడు ఎందుకు అన్నిటినీ 'పోగు' చేస్తావని ప్రతి మృతదేహమూ చెబుతూనే ఉంటుంది. Why Collect When You Can't carry?" ఓ క్షణం ఆగాడు పుండరీకాక్షుడు .

వాసుదేవ్ వింటున్నాడు.

"అలాగే ఏ ఇంట్లో పుట్టినా ఎలా పుట్టినా కూడా మనం యీ లోకంలోకి ఏమీ తేలేదు. కానీ పుట్టిన క్షణం నించీ మరణించే వరకూ యీ లోకము ప్రకృతీ అన్నీ ఇస్తున్నాయి. నిజం చెబితే ఉచితంగా! ఎడారిలో నిలబడ్డవాడికి తెలుస్తుంది, నీటి విలువ, నీడ విలువ, చీకట్లో తపించి పోయేవాడికి అర్ధమవుతుంది వెలుగు విలువ. చివరి శ్వాస అందని వాడికి అపారంగా తెలుస్తుంది ఉచితంగా లభించే శ్వాస విలువ. ప్రకృతి, గాలీ, నీరూ, వెలుగూ అన్నీ ఉచితంగానే ఇస్తోంది నేల! కోటానుకోట్ల జీవులకి ఆహారాన్ని సమకూరుస్తున్నది. కానీ మనిషి ప్రతిదాన్నీ వ్యాపార వస్తువుని చేశాడు. ఆఖరికి నమ్మకాన్ని కూడా అమ్మకానికి పెడతున్నాడు" మళ్ళీ ఆగాడు పుండరీకాక్షుడు. వాసూతోపాటు అచ్యుత్ కూడా శ్రద్ధగా వింటున్నాడు.

"ప్రతి జననం మరణానికి  పునాదే.. ప్రతి మరణమూ మరో జననానికి పునాదే. కానీ, మరణించిన వారు మళ్ళీ పుడతారా అనేదే చిక్కు విడని ప్రశ్న. ఒకవేళ పుడితే ఎలా? మళ్ళీ మనిషిగానేనా, మరో రూపంలోనా?" ఆగారు పుండరీకాక్షుడు. ఆయన మాటలు వాసుదేవ్‌తో మాట్లాడినట్టు లేదు. తనలో తను మాట్లాడుకుంటున్నట్లు ఉన్నాయి. ఆ విషయం వాసుదేవ్‌కి మొదలే అర్థమయింది.

"మనిషి జీన్ స్ట్రక్చర్ మారడానికి 2కోట్ల 80 లక్షల సంవత్సరాలు పడుతుందని ఒకరు నిర్ధారణకి వచ్చారు. అంటే, మనం మనం కాదు. మన పూర్వీకుల జీన్స్‌ని మనతో మోసుకొస్తున్న వాహకులం. అందుకే, గోత్రాన్ని చెబుతాం. జీన్స్ మారేవరకూ గోత్రం కూడా మారదుగా. ఇప్పుడు ముస్తఫిజర్ పుడితే ఎక్కడ పుడతాడూ? హూంజావేలీలోనా, ఢిల్లీలోనా హైదరాబాదులోనా?" మళ్ళీ మౌనం.

"మనుషులకి గోత్రాలున్నాయి. జీవులకి లేవుగా? చిన్న విచిత్రం చూడు.. ముస్త ఫిజర్ మళ్ళీ ఎక్కడ ఎలా పుడతాడని ఆలోచిస్తున్నాం. కానీ, జననానికి ముందు మనం ఏమిటీ? ఎక్కడ నించి తల్లి గర్భంలోకి వచ్చాం. లక్షలాది బీజాల్లో (వీర్యంలోని బీజాల్లో) ఒకటో రెండో మాత్రమే అండాన్ని ఎలా చేరతాయి? మిగిలినవన్నీ తలవంచుకుని పోవడమేగా! అసలీ అణువంత బీజం ఎలా సృష్టింపబడిందీ? 'ఈ ప్రశ్నలు వేసుకోము. ఎక్కడో అక్కడ ఏదో ఒక రూపంలో నువ్వు జననానికి ముందు లేకుంటే, అసలు జన్మనే ఎత్తవుగదా! విత్తనం లేని చెట్టు మొలుస్తుందా? బీజం విత్తనం అయితే అండం భూమీనీరూలాంటిది. గర్భం 'అవకాశాన్నిచ్చే' ఆకాశం. జనాలకి పుట్టుక గురించి ఆలోచనే ఉండదు. మృత్యువు ఎంత తెలియనిదో, జననమూ అంతే తెలియనిది. వాసూ.. ఒక బంధం తెగిపోయింది. కానీ ఆ బంధం నేనున్నన్నినాళ్ళూ నాతో, నా మనసులో శాశ్వతంగానే ఉండిపోతుందిగా! అంటే మృత్యువు శరీరానికే గానీ మనసుకీ ఆత్మకీ కాదన్నమాట" మళ్ళీ ఆగారు పుండరీకాక్షుడు.

"గులాబో టీ స్టాల్ దగ్గర ఆపు" అతి మెల్లగా అచ్యుత్‌కి చెప్పాడు వాసుదేవ్.

"అవునురా.. ఆ పిల్లకీ చెప్పాలి" నిట్టూరుస్తూ  అన్నాడు పుండరీకాక్షుడు.

"పోయేవాళ్ళంతా ఎక్కడికి పోతున్నావో చెప్పేదెవరూ? వచ్చేవాళ్ళు ఎక్కడినించి వస్తున్నావో కూడా చెప్పేదెవరు. రాకపోకల మధ్య రభసేగా జీవితం" మళ్ళీ అన్నాడు పుండరీకాక్షుడు. ఆయన ముస్తఫిజుర్ మృతి గురించి చాలా బాధపడుతున్నాడని వాసుకి తెలిసిది.

"ఒక పోలీసు ఉద్యోగిగా నా జీవితాన్ని మొదలుపెట్టిన నేను, రిటైర్మెంట్ వరకూ నా బాధ్యతని సక్రమంగా నిర్వర్తించాను. కులమతాలు ఊబిలో ఏనాడు చిక్కుకోలేదు. వాసూ నీకూ తెలుసు. పోలీసులు ఉందేది ఎవరితోనో.

దొంగలు, హంతకులు, దగా కోరులు, రేపిస్టులు, శాడిస్టులు, అనైతిక పనులకు పాల్పడేవారి మధ్య. గంజాయి వనంలో తులసి మొక్కలా బ్రతకాలంటే ఎంత కష్టమో తెలుసుకదు! పై అధికారుల ఆజ్ఞలు శిరసావహించి తీరాలి, ఆపై అధికారులు రాజకీయ నాయకులకూ, అధికార వర్గాలకీ జేజేలు కొడుతూ తమ పదవుల్ని కాపాడుకునేవారైతే ఎంత ఘోరం. పొద్దున్న ఇంటినించి బయటపడ్డ పోలీసు మళ్ళీ ఎప్పుడింటికొస్తాడో, లేదా, అటునించి అటే పై కెళ్ళిపోతాడో ఎవరికి తెలుసూ? రౌడీలూ దాదాలూ గూండాలు అందరికీ తెలుసు. కానీ వాళ్ళు పోలీసుల్ని ఈగల్లాగా దోమల్లాగా చూస్తారు. కారణం ఎవరూ? పొలిటికల్ లీడర్సు. వీళ్ళు వాళ్ళకి అండగా ఉంటే, వాళ్ళు వీళ్ళకి అండగా ఉంటారు. ఎంత సిన్సియర్ అధికారి అయినా, వీళ్ళని ఏమీ చేయలేడు. ఒకవేళ అరెస్టు చేసినా, అర్జంటుగా బెయిల్ వస్తుంది" ఆగారు పుండరీకాక్షుడు కొంచెం ఆయాసంతో.

"లేదు నాన్నా.. మీరు కాస్త రెస్టు తీసుకోండి" అన్నాడు వాసు.

"లేదురా. ఇప్పుడే మాట్లాడాలి. నన్ను మాట్లాడనీ. అప్పటి పరిచయం ముస్తుఫిజుర్. నేను 'ముస్తీ' అని పిలిచేవాడ్ని. నేను  ఖేదపడ్డప్పుడల్లా ఖురాన్ సూక్తులు వినిపించేవాడు. "మన పని మనం చేద్దాం భయ్యా, ఆపైన దేవుడున్నాడు" అని ఓదార్చేవాడు. తను ధర్మం తప్పలేదు. తన బాటలో నేనూ ఏనాడూ ధర్మం తప్పలేదు. సహోదరుల్లా ఉన్నాం. ఈ నేలమీద పుట్టాం. ఈ నెలలో కలిసిపోతాం. ఇది తెలిసిన మనుషులకి మత దౌర్జన్యాలూ, కులయుద్ధాలూ ఎందుకు? ఒకర్ని ఒకరు ఎందుకూ చంపుకోవడం? ఎన్నోసార్లు కళ్ళారా చూశాను. అపరాధులు దర్జాగా బయట తిరుగుతుంటే, నిరపరాధులు నెలల తరబడి బెయిలు అందక జైళ్ళల్లో అల్లాడిపోవడం. వాసూ, చివరికి న్యాయం కదా గెలవాల్సింది. ఉహూ.. కాదు. న్యాయం గెలవదు. తెలివైన న్యాయవాది గెలుస్తాడు "సుదీర్ఘంగా నిట్టూర్చాడు" పుండరీకాక్షుడు.

"ముమ్మాటికీ నిజం బాబాయ్‌గారూ అన్నీ వింటున్న అచ్యుత్, టీ స్టార్ దగ్గర జీపు ఆపి అన్నాడు .

"మీరొస్తారని అనుకుంటున్నా.." ఆప్యాయంగా పుండరీకాక్షుడి పాదాలకి నమస్కరించింది గులాబో.

"ఆయుష్మతీభవ" అన్నారు పుండరీకాక్షుడు.

"గులాబో, ముస్తిఫిజుర్" అంటూ ఆగారు.

"తెలుసు బాబాయ్.. చూసి వచ్చాను" అంటూ ఓ క్షణం వాసుదేవ్ వంక చూసింది. ఆ చూపుని పుండరీకాక్షుడు గమనించాడు.

ఎస్.పి వాసుదేవ్ జీప్ దిగాడు. అచ్యుత్ రెండు టీలు తీసుకుని పుండరీకాక్షుడికి ఒకటిచ్చి, వాసుదేవ్‌కి ఒకటిచ్చి జీప్‌లో కూర్చున్నాడు. జనాలు చాలా పలచగా ఉన్నారు. పాతబస్తీ అంతా జియాగారి ఇంటిముందే చేరిందా అన్నట్టుంది.

"కొన్ని వందలమందికి ఉగ్రవాద శిక్షణ ఇస్తున్నట్టు తెలిసింది. ఇతర రాష్ట్రాలనించి వచ్చినవారు 'ఎర'లను జల్లుతారు. ఆ వలలో పడేవాళ్ళకి మృత్యువే గమ్యం. అన్నా పధ్నాలుగు పదిహేనేళ్ళ కుర్రాళ్ళని వీరి పద్ధతులు బాగా ఆకర్షిస్తున్నాయి. ఇప్పటివరకూ యువకులే అనుకుంటే, యువతులు కూడా పెద్ద సంఖ్యలో చేరుతున్నారు. చాలా శ్రద్ధగా నిష్ఠగా యీ మనసు మార్పిడి జరుగుతోంది" మెల్లగా చెప్పింది గులాబో.

నిట్టూర్చాడు వాసుదేవ్. "బిహారీ గ్యాంగ్ ఒకటి, బంగ్లాదేశ్ గ్యాంగ్ ఒకటీ, రోహింగ్యాలు రెండు మూడు తిరుగుతున్నాయి. వాళ్ళు ఇక్కడ ఉపద్రవాల్ని సృష్టించక పోవచ్చు. కానీ ఇక్కడ 'సమిధల్ని' తయారు చేస్తున్నారు. యువతీయువకులపైన తల్లిదండ్రుల దృష్టిలేదు. పిల్లలకీ ఏ భయమూ లేదు. సినిమా హీరోల్లాగా వెలిగిపోవాలనే అత్యాశక్తే వాళ్ళని విచ్ఛిన్నం వైపు నడిపిస్తోంది" మరో టీ కప్పు ఇచ్చి అన్నది గులాబో.

మతాన్ని ధార్మికంగా ఉపయోగించుకున్న జియా ముస్తఫిజుర్ వాసు మనసులో తటిల్లతలు మెరిశాడు.

మానవత ఉన్న తరాలు నాయకులూ నిష్క్రమిస్తే రేపటి తరం ఏమవుతుందీ ? ఎవరూ రేపటి తరానికి సక్రమమైన దారి చూపేదీ? ఆలోచనలు చుట్టు ముట్టాయి.

"ఇంకేమైనా" అన్నాడు వాసుదేవ్.

"అన్నా.. ఆకర్షింపబడుతున్న వాళ్ళలో అన్ని మతాలవారు ఉన్నారు. కావల్సినంత డబ్బు వెదజల్లుతుంటే, తెలిసీ తెలియని యువత ఎందుకు ఆకర్షింపబడరూ? మొన్నటివరకూ అతి దరిద్రంలో కొట్టుకుపోతున్న కుటుంబాలు రాత్రికి రాత్రి మధ్యతరగతిని మించి ఎదుగుతున్నాయి. పిల్లలు చెడుతున్నారని తల్లిదండ్రులకి తెలిసినా, వస్తున్న డబ్బూ, ఆ డబ్బిచ్చే సుఖాలూ సౌకర్యాలూ పెద్దల్ని కూడా మౌనంలోకి నెడుతున్నాయి" అన్నది గులాబో.

"కూడూ గుడూ గుడ్డ.. రోటీ కపడా మకాన్.. ఈ మూడు భద్రతలూ లేనంతకాలం మనదేశమే కాదు ఏ దేశమూ పురోగమించలేదు. మనం సృష్టించుకున్న కొన్ని నిర్ణయాలే మనని ధ్వంసం చేస్తున్నాయి. ఒకడు పరిశ్రమ పెడతానని పెడతానని ముందుకొస్తాడు. బేంకుల్లోంచే అప్పు తీసుకుంటాడు. ఎదుగుతాడు. ఎంతగా అంటే, వాడి 'బ్రాండ్' కి ష్యూరిటీ లేకుండా వేల కోట్లు అప్పించేంతగా! గులాబో, నువ్వో హోటల్ అదీ అతి చిన్నది పెడతానంటే డబ్బివ్వని బేంకులు, నువ్వు ఫైవ్ స్టార్ హోటల్ కడతానంటే అప్పివ్వడానికి క్యూలో నిలుచుంటై. సరే యీ చర్చ ఆగేదికాదు. దారి తప్పిన వాడ్ని

దారిలోకి తీసుకురావొచ్చు. దారినే మార్చేవాడిని? "చూడు" ఇంక గమనించు. ఏ చిన్న విషయాన్నీ వదలకు. సరేనా" టీ కప్పు కిందపెట్టి లేచాడు ఎస్.పి వాసుదేవ్. అప్పటికే చాలమంది కళ్ళు తనమీద పడ్డాయని అతనికి తెలుసు.

"ఓ ఎస్.పిగా ఇంతసేపు అక్కడ ఉండటం" ఆగాడు పుండరీకాక్షుడు.

"మొన్న ఇక్కడ నేనో గంట ఉన్న సంగతి చాలామంది చూశారు. ఇప్పుడు చూశారు. ఆమెకి ప్రమాదం తలపెట్టాలంటే, జనాలకి ధైర్యం ఉండకూడదు. అందుకే కావాలని అక్కడ కూర్చున్నా. నాన్నా అలా కూర్చోడం నీ మనసుని కూడా మళ్ళిందిగా. ఆత్మ గాలిలో కలిసిపోయింది. పనికిరాని శరీరం పడుకుని ఉన్నది. ఆయన వెళ్ళిపోయినా, ఆయన జ్ఞాపకాల సంపద మన దగ్గర ఉన్నైగా" రియర్ వ్యూ మిర్రర్‌లో చూస్తూ అన్నాడు వాసుదేవ్. అచ్యుత్ బండి ముందుకు పోనిచ్చాడు.

"ఉగ్రవాదం నించి మానవుడికి విముక్తిలేదా?" అడిగాడు అచ్యుత్. చిన్నగా నవ్వాడు వాసుదేవ్.

"ఒకప్పుడు ఇది ఒక 'వాదం' ఇప్పుడు ఇది 'నైజం' ప్రేమతో మనిషిని జయంచడం చాలా కష్టం. కానీ 'భయం' అనే ఆయుధంతో జనాల్ని గుప్పెట్లో పెట్టుకోవడం చాలా సులువని ఎప్పుడు రుజువైందో, అప్పట్నించీ లోకాన్ని ఏలుతున్నది 'భయపెట్టడం' అనే ఆయుధమే. ఎందుకంటే, భయం అనేది మనసును లొంగదీస్తుంది." అన్నాడు వాసుదేవ్.

"మనిషికి దేవతలంటే భయం. దేవతలకి రాక్షసులంటే భయం. వెరశి అందరికీ భయం అంటే భయం" అన్నారు పుండరీకాక్షుడు, బాధనించి బయట పడుతూ.

ఒణికి పోతున్నది మహా కన్యాదేవి. మహామాయ సముదాయిస్తున్నది. హనుమంతు సూటిగా చూస్తున్నాడు. మిగతా అందరూ నిద్రలో ఉన్నారు.

"ఏమయిందమ్మా" అడిగిన ప్రశ్నకి మళ్ళీ మళ్ళీ అడుగుతుంది మహామాయ. మెల్లగా గుర్తుకు తెచ్చుకుంటూ మరింత ఒణికి పోతోంది మహా కన్యాదేవి.

"ఈ ట్రైను.. యీ ట్రైను" అరిచింది సడన్‌గా మహా కన్యాదేవి.

"ఊ.. ఏమిటీ యీ ట్రైను. ఆశ్చర్యంతో అన్నది మహామాయ.

"భూమిలోంచి ఏదో, భూమి చీల్చుకొస్తోంది. వందల శవాలు... రక్తం.. చెల్లాచెదురైన అవయవాలు ఓ ట్రాన్స్‌లో ఉన్నట్టు మాట్లాడుతోంది మహాకన్యాదేవి.

"చూడమ్మా.. మనం చక్కగా చల్లగా ప్రయాణిస్తున్నాం. రైలు చక్కగా వేగంగా వెళుతోంది. పొద్దుటికల్లా అంతా సద్దుకుంటుంది. పడుకో నేను నీ దగ్గరే ఉంటాను." మహాకన్యాదేవి పాదాల దగ్గర కూర్చుని ఆమె పాదాలు ఒడిలో పెట్టుకుని లాలనగా అన్నది మహామాయ.

మహాకన్యాదేవి ఏదేదో మాట్లాడుతోంది. మాట్లాడుతోంది. ఏమిటో హనుమంతుకీ, మహామాయకీ కూడా అర్థంకాలేదు. మాట్లాడుతూనే మౌనమయ్యింది ఆమె స్వరం. మహామాయ చెయ్యి కన్యాదేవి నుదుటిమీద ఆనించింది. ముఖం అంతా చెమటతో తడిసివుంది. ట్రాన్స్‌లో ఉన్నట్టు ఉంది మహాకన్య.

"పిచ్చిపిల్ల.. భయపడినట్టుంది హనుమంతూ.. ఆ నీళ్ళు సీసాపట్టుకురా" అన్నది మహామాయ.

చల్లగా చక్కగా వెడుతున్న రైలు శబ్దంలో ఏదో విచిత్రమైన మార్పు. సూటిగా వెళ్ళే రైలు అటూ ఇటూ ఊగుతున్నట్టు పోతోంది. వేగం మరింత పెరిగింది. కంపార్టుమెంట్లు ఊగిపోతున్నాయి. పై బెర్తులోని నీళ్ళబాటిల్‌ని తియ్యడం అసాధ్యమయింది హనుమంతుకి. గట్టిగా రెయిలింగ్స్‌ని పట్టుకుని ఉన్నాడు. మహా కన్యాదేవి పాదాల్ని పట్టుకుని కూర్చున్న మహామాయ కూడా కంపార్టుమెంట్‌తో ఊగుతోంది.

సడన్‌గా వర్షం. మెరుపుల తళతళలు గ్లాస్‌డోర్స్ గుండా కనిపిస్తున్నాయి. పెద్ద పెద్ద చినుకులు వెర్రెత్తినట్టు ట్రైన్‌ని యీడ్చికొడుతున్నాయి. గాలి తుఫానుగా మారి కంపార్టుమెంట్స్‌ని కుదిపేద్తోంది.

"అమ్మ స్పృతిలో లేదురా హనుమంతూ.. నేలమిద కూర్చుని కాళ్ళు పట్టుకో. నేను తను కిందపడకుండా తల దగ్గరుంటే" అన్నది మహామాయ. వర్షపు హోరులో ఆ మాటలు లీలగా వినిపించి రెయిలింగ్స్‌ని పట్టుకుని నిలబడ్డ వాడల్లా చటుక్కున మహా కన్యాదేవి పాదాల వద్ద కూర్చున్నాడు. తల సీటుకి కొట్టుకుంది. చెప్పలేని నెప్పి.

"అమ్మా.. యీ ట్రైను.. యీ ట్రైను అన్నది కదా అమ్మ.. దీనికేదన్నా.." సగంలో ఆగాడు హనుమంతు. నిద్రపోతున్న కన్యలందరూ గట్టిగా బెర్తలను జాయిన్ చేసే గొలుసుల్ని గట్టిగా పట్టుకుని కూర్చుండటం మహామాయ హనుమంతు ఇద్దరూ చూశారు.

"భయపడకండి. మహాకన్యాదేవి అమ్మవారి అంశ. ధైర్యంగా ఉండండి" అందరికీ వినబడేలా అరిచింది. మహామాయ.. సడన్‌గా కంపార్టుమెంట్‌లోని లైట్లు పోయాయి. వేగంగా వెళుతున్న ట్రైను పట్టాలకి క్రీక్ క్రీక్ మంటూ రాజుకుంటుంటే నిప్పులతో ఎగసిపడుతున్నాయి. బ్రేకులేసినట్టుగా కంపార్టుమెట్లు ఒకదానొ్నకటి గుద్దుకున్నాయి. పై బెర్తులోనించి కిందపడుతూ షోడశ కన్యలూ హాహాకాకారాలు చేశారు. మహామాయ తలకి దెబ్బతగిలింది. అయినా ఆమె మహాకన్యాదేవిని కిందపడకుండా పట్టుకునే ఉంది.

వెర్రెత్తినట్లు వూడిన కంపార్టుమెంటు ఒకటికొకటి గుద్దుకుంటూ చివరికి పెద్ద శబ్దంతో ఆగాయి. మహాకన్యాదేవి నిద్రలో ఉందో, స్పృహలేకుండా పడుందో దేవుడికే తెలియాలి.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments